క్లుప్తంగా

మర్యాద పూర్వక కలయిక



మైనంపల్లిని కలిసిన నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు గురువారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును కలిసి అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్దన్, నార్సింగి మండల నాయకులు అంచనూరి రాజేశ్, రుక్మొద్దీన్, కేశవ్, రాజసింగ్, లక్ష్మీ నర్సింహులు ఉన్నారు.

కోళ్ల పెంపకానికి ప్రోత్సాహం



మాట్లాడుతున్న సరస్వతి

చిన్నశంకరంపేట(మెదక్): మహిళా శక్తి పథకంలో భాగంగా పెరటికోళ్ల పెంపకానికి ప్రభుత్వం మహిళలను ప్రోత్సహిస్తోందని డీఆర్డీఏ అడిషనల్ పీడీ సరస్వతి పేర్కొన్నారు. మండల పరిధిలోని మడూర్‌లో మహిళా సంఘం సభ్యులకు పెరటికోళ్ల పెంపకంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కో సభ్యురాలికి 25 నుంచి 100 వరకు నాటు కోళ్ల పెంపకం కోసం రుణం అందజేస్తున్నట్లు చెప్పారు. మహిళలు ముందుకు రావాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీఎం ప్రకాశ్, ఐకేపీ సీసీ యశోద పాల్గొన్నారు.

మొహర్రంపై సమావేశం



మాట్లాడుతున్న ఎస్‌ఐ సుభాష్‌గౌడ్

మనోహరాబాద్(తూప్రాన్): రానున్న మొహర్రం వేడుకలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ సూచించారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పలు గ్రామాలకు చెందిన మైనార్టీ నాయకులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి, తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు జావీద్, ఇర్ఫాన్, సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ నిర్లక్ష్యంతో చిన్నారి తలకు గాయం



చిలప్‌చెడ్(నర్సాపూర్): అంగన్‌వాడీ టీచర్, ఆయాలు నిర్లక్ష్యంగా ఉండడంతో ఓబాలుడి తలకు గాయమైంది. ఈ ఘటన మండలంలోని ఫైజాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. సవాళ్ల శ్రీవాన్స్ అనే విద్యార్థి ఆడుకుంటూ కిందపడి తలకు గాయమైంది. రెండు గంటలైనా టీచర్ జనాబాయి, ఆయా ఫాతిమా తమకు సమాచారం ఇవ్వలేదని ఆ బాలుడి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాను రికార్డులు చూస్తున్న సమయంలో బాలుడు కిందపడడంతో గాయమైందని, తమ నిర్లక్ష్యం ఏమీలేదని టీచర్ తెలిపారు.

ఆరుతడి పంటలు అనుకూలం



అవగాహన కల్పిస్తున్న ఐటీసీ ప్రతినిధులు

మనోహరాబాద్(తూప్రాన్): వాతావరణానికి అనుగుణంగా ఉన్న వరి, ఆరుతడి పంటలను వేసుకోవాలని మైరాడ స్వచ్ఛంద ఎన్జీఓ సంస్థ ప్రతినిధులు సూచించారు. మనోహరాబాద్ మండలం గౌతోజీగూడెంలో రైతులకు గురువారం వారు అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందులు, ఎరువుల వినియోగం తదితర అంశాల గురించి వివరించారు. గ్రామ ఊర చెరువు కట్టకు మరమ్మతులు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్ రేణుకుమార్, ఐటీసీ సంస్థ ప్రతినిధులు విజయవర్ధన్‌రెడ్డి, మంజునాథ్, జయప్రకాశ్, బాబు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మా ఊరికి మద్యం వద్దు

- పంచాయతీ వద్ద మహిళల ఆందోళన
- దుకాణం ఏర్పాటు నిలిపివేయాలి
- ఆత్మహత్యలే శరణ్యం



మడూర్‌లో వైన్ షాపు ఏర్పాటు చేయవద్దని ఆందోళన చేస్తున్న మహిళలు

చిన్నశంకరంపేట(మెదక్): 'మా ఊర్లో మద్యం దుకాణం పెట్టి.. మా ఉసురుతీయొద్దు' అని మహిళలు ఆందోళనకు దిగారు. మండలంలోని మడూర్ గ్రామ మహిళలు పంచాయతీ వద్దకు ర్యాలీగా తరలివెళ్లి అనుమతి ఇవ్వొద్దని గురువారం నిరసన వ్యక్తం చేశారు. చిన్నశంకరంపేటలో ఉన్న కేవీఆర్ వైన్స్‌ను మడూర్ గ్రామ శివారులో గవ్వలపల్లి–ఖాజాపూర్ రోడ్డుపై ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న మడూర్ మహిళలు పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. గ్రామంలో వైన్స్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ వారంతా కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు కూడా వినతిపత్రం అందజేశారు. గ్రామంలో కొన్నేళ్లుగా మద్య నిషేధం విధించామని, ఇప్పుడు ప్రభుత్వం వైన్స్ దుకాణం ఏర్పాటుకు అధికారులు అనుమతి ఇవ్వొద్దని వారు డిమాండ్ చేశారు. స్థానికుల అభిప్రాయం కాదని ఏర్పాటుచేస్తే ఆ దుకాణం వద్దే తాము ఆత్మహత్యలు చేసుకుంటామని మహిళలు హెచ్చరించారు.

పనులు ఎలా చేసుకుంటాం..



వైన్ షాపు ఏర్పాటుచేసే చోట చుట్టూ పంటపొలాలు ఉన్నాయి. పొలాల వద్దకు వెళ్లి వచ్చే సమయంలో మహిళలు మందుబాబులతో ఇబ్బందులు పడాల్సివస్తుంది. అధికారులు ఆలోచించి మెదక్ రోడ్డు మీద ఏర్పాటు చేయాలి. మా గ్రామంలో ఏర్పాటు చేసి మా ఉసురు తీయొద్దు.

– అనురాధ, మహిళాసంఘం, మడూర్

మద్య నిషేధం ఉన్న ఊర్లో పెడతారా?



ఎన్నో ఎళ్లుగా మా గ్రామంలో మహిళాసంఘం ఆధ్వర్యంలో మద్యనిషేధం విధించాం. నిషేధం ఉన్న ఊర్లోనే వైన్‌షాపు పెడతారా? చూస్తూ ఊరుకోం.. అడ్డుకుని తీరుతాం. మేం ప్రాణంతో ఉన్నంత వరకు ఇక్కడ ఏర్పాటు చేయనీయం. అధికారులు వెంటనే ఏర్పాట్లను నిలిపివేయాలి. లేకపోతే ఆందోళనను ఎదుర్కోవాల్సి వస్తుంది.

– సుజాత, మహిళాసంఘం, మడూర్

గ్రీన్‌ప్లానింగ్ ఏర్పాట్లు పూర్తి చేయండి

- ఎంపీడీఓ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాలలో వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటేందుకు గ్రీన్‌ప్లానింగ్ ఏర్పాట్లు పూర్తిచేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. గురువారం కౌడిపల్లిలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోను నాలుగు వేల మొక్కలు నాటాలన్నారు. ఉపాధి హామీలో పండ్లతోటల పెంపకానికి అవకాశం ఉందని రైతులకు అవగాహన కల్పించాలని, ఫామ్ పాండ్(పంట కుంట) సైతం మంజూరు చేయాలని చెప్పారు. జాబ్‌కార్డు కలిగి ఉండి ఆధార్ అనుసంధానం కాని వారిని గుర్తించి ఎన్‌పీసీఐ పూర్తి చేయాలని, వనమహోత్సవానికి గుంతలు తీసి సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ పుణ్యదాస్, ఇన్‌చార్జి ఎంపీఓ వెంకటేశం, పంచాయతీ కార్యదర్శులు, ఈసీ ప్రేమ్ కుమార్, టీఏలు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీ



పెద్దశంకరంపేటలో గురువారం ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వాసుపత్రి సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించారు. జనాభా నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది యాదయ్య, గ్రేస్, పాల్, కమల, రమాదేవి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు..

రామాయంపేట(మెదక్): ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా స్థానిక స్నేహబంధు లయన్స్ క్లబ్ సభ్యులు గురువారం స్నేహ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అధిక జనాభా వల్ల కలిగే అనర్థాల గురించి క్లబ్ ప్రతినిధులు వారికి వివరించారు. పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. క్లబ్ జిల్లా ద్వితీయ గవర్నర్ విజయలక్ష్మి, క్యాబినెట్ కార్యదర్శి శ్రీధర్, కోఆర్డినేటర్ నరసింహరాజు, కోశాధికారి మధు, సభ్యులు శ్రీనివాసరావు, సాగర్, గంగారాం, రవీందర్‌గౌడ్, దీప్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

శివంపేట(నర్సాపూర్): ఆలయాలు, పొలాలకు వెళ్లే దారులను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. గురువారం మండల పరిధిలోని బిజిలీపూర్ గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు పురాతన దేవాలయాలకు సంబంధించిన దారితోపాటు పొలాలకు వెళ్లే దారులను ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. పదిరోజుల క్రితం ఈ విషయంపై సర్వేకు వచ్చిన అధికారులతో గ్రామస్తులు వాగ్వాదం చేయడంతో తహసీల్దార్ కల్పించుకొని సమస్య పరిష్కరిస్తానని చెప్పినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదని వాపోయారు. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇన్‌చార్జి తహసీల్దార్ శఫియొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆంజనేయులు, పోచయ్య, జయరాజ్, బ్రహ్మచారి, కృష్ణ, ముత్యాలు, వినోజ్, ఇమ్రాన్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

కేబుల్‌వైర్‌ల చోరీ

కౌడిపల్లి(నర్సాపూర్): రెండు గ్రామాలలో ఎనిమిది బోరుబావుల వద్ద నుంచి గుర్తుతెలియని వ్యక్తులు కేబుల్‌వైర్‌లను చోరీచేశారు. గురువారం ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కౌడిపల్లికి చెందిన పుండరీకం, కలి నాగరాజు, చంద్రం శ్రీనివాస్‌గౌడ్, కొత్తగూడెం శ్రీశైలం బోరుబావుల వద్ద నుంచి అలాగే మహ్మద్‌నగర్‌లోని పంచాయతీ బోర్‌తోపాటు దర్జి నరేశ్, శ్రీనివాసరావ్, గొల్ల నర్సింహులు, మధుసూదన్‌రెడ్డి బోరుబావుల వద్ద నుంచి కేబుల్‌వైర్‌లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని యశ్వంతరావ్‌పేట ఫారెస్ట్‌లో ఓ పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు గురువారం దాడి చేశారు. పదిమందిని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.14,200 సీజ్ చేశారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

నెంబర్లులేని బైక్‌లు సీజ్

తూప్రాన్: నెంబర్లు లేకుండా నడుపుతున్న ఎనిమిది ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శివానందం గురువారం తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా సరైన ధ్రువపత్రాలతోపాటు లైసెన్స్‌లు కలిగి ఉండాలని, నంబర్లు కనిపించకుండా స్టిక్కర్లు వేయించి ఉన్న వాహనదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపైనా కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

అండగా ఉంటాం..



చెక్కును అందజేస్తున్న దేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): తమ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని ఎవరూ ఆందోళన చెందవద్దని బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దేవేందర్‌రెడ్డి చెప్పారు. గురువారం చందాపూర్ గ్రామంలోని కార్యకర్త వెంకటమ్మ కుటుంబ సభ్యులకు రూ.2లక్షల ప్రమాదబీమా చెక్కును అందజేశారు. ఆమె ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా పార్టీ ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన చెక్కును ఆయన అందజేశారు. అలాగే రుద్రారం గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన కార్యకర్త నర్సింహులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట రాజు, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్, కృష్ణాగౌడ్, ప్రసాద్ ఉన్నారు.

రోడ్డు గుంతలు.. ప్రజలకు ఇక్కట్లు



ధ్వంసమైన వెల్దుర్తి–మెదక్ ప్రధాన రహదారి

మండల కేంద్రమైన వెల్దుర్తి నుంచి జిల్లా కేంద్రమైన మెదక్ వెళ్లే దారిలో చాలాచోట్ల బీటీ రోడ్డు ధ్వంసం కావడంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దానికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పక్కన ఉన్న మట్టి కొట్టుకుపోయి కయ్యలు ఏర్పడ్డాయి. దీంతో రాత్రి వేళల్లో రోడ్డు పక్కకు వాహనాలు మళ్లించాలంటే ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకోవాల్సిందే. ధ్వంసమైన రోడ్డుపై రాకపోకలు సాగించడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని, వాహనాలు కూడా దెబ్బతింటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. గతంలో ఆటోడ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంతలను పూడ్చినా వర్షాల వల్ల సమస్య మళ్లీ మొదటికి వచ్చింది.

– వెల్దుర్తి(తూప్రాన్)

సేవలందించాం.. న్యాయం చేయండి

- అంగన్‌వాడీల డిమాండ్



రిలే దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీలు

మెదక్ కలెక్టరేట్: యేళ్ల తరబడి అంగన్‌వాడీ కేంద్రాలద్వారా ప్రజలకు ఎన్నో సేవలందించామని, తమకు న్యాయపరంగా రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను వెంటనే ఇవ్వాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు నిర్వహిస్తున్న రిలే దీక్షలు ఆరోరోజు గురువారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పథకాలను ప్రజలకు అందజేయడం, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో నిరంతరం కృషి చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం వృద్ధాప్యంలో ఉన్న తమకు బెనిఫిట్స్‌తో రిటైర్మెంట్ ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి నర్సమ్మ, సీతామహాలక్ష్మి, లక్ష్మీబాయి, నాగమ్మ, పద్మమ్మ, దొడ్ల పద్మమ్మ, నర్సింగమ్మ, మౌలానాబీ, సాకలి బాలమ్మ, పాతిమా, లక్ష్మమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవం.. గ్రామాల పచ్చదనం

- డీఈఓ రాధాకిషన్



మొక్కలు నాటుతున్న డీఈఓ

కొల్చారం(నర్సాపూర్): గ్రామాలను పచ్చదనంతో నింపేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ విధిగా పాల్గొనాలని మండల ప్రత్యేక అధికాధికారి డీఈఓ రాధాకిషన్ పిలుపునిచ్చారు. మండలంలోని ఏటిగడ్డ మాందాపూర్, వెంకటాపూర్ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన మనోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజలు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మి నర్సింహులు, ఎంఈఓ నీలకంఠం, ఏపీఓ మహిపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సంధ్య, అంజు మున్నిషా బేగం, మాజీ సర్పంచ్ విష్ణువర్దన్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు, లక్ష్మి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన



మెదక్‌లో మాట్లాడుతున్న సుభాష్‌చంద్రగౌడ్

మెదక్‌జోన్: సిద్దిపేటలో అడ్వకేట్ రవికుమార్‌పై ఏఎస్‌ఐ ఉమారెడ్డి చేసిన దాడికి నిరసనగా గురువారం మెదక్ కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్ చంద్రగౌడ్ మాట్లాడుతూ దాడికి పాల్పడిన ఏఎస్‌ఐని కఠినంగా శిక్షించాలని, లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, జైట్ సెక్రెటరీ దుర్గారెడ్డి, సీనియర్ న్యాయవాదులు పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో..

స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



చిన్నశంకరంపేట(మెదక్): భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన శాలిపేట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్ కథనం మేరకు గ్రామానికి చెందిన బండారి భిక్షపతి తన భార్య లింగవ్వతో గొడవ పడి 8వ తేదీన పొలం వద్దకు అని చెప్పి వెళ్లి మూడు రోజులైనా ఇంటికి తిరిగిరాలేదు. దీంతో అతడి కుమారుడు ప్రవీణ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి



శిక్షణ పూర్తిచేసుకున్న టీచర్లతో సీడీపీఓ, సూపర్‌వైజర్లు

- సీడీపీఓ హేమభార్గవి

శివ్వంపేట(నర్సాపూర్): శిక్షణ పొందిన టీచర్లు అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి చేయాలని ఐసీడీఎస్ నర్సాపూర్ ప్రాజెక్ట్ సీడీపీఓ హేమభార్గవి పిలుపునిచ్చారు. పూర్వప్రాథమిక విద్యపై మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ ముగింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను కేంద్రాలలో ఆచరించి పిల్లలకు ఆటపాటలతో విద్యనేర్పాలని సూచించారు. పిల్లలోని సృజనాత్మకతను వెలికి తీయాలని, కేంద్రాల నిర్వహణలో నిర్లక్షం చేయవద్దని చెప్పారు. కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్లు సంతోష, వసుమతి, నర్సాపూర్ ప్రాజెక్ట్ పరిధిలోని సూపర్‌వైజర్లు శశికళ, లక్ష్మి, సునీత, సక్కుబాయి, పోషణ అభియాన్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీహెచ్‌సీని తనిఖీ చేసిన ఆర్డీఓ

తూప్రాన్: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ జయచంద్రారెడ్డి సూచించారు. గురువారం స్థానిక సీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. పలువార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలు, మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు.

◆ ఘనంగా ఇంజనీర్స్‌డే

మెదక్‌జోన్: నీటిపారుదలశాఖలో ఇంజనీర్‌గా విధులు నిర్వహించిన నవాబు అలీ నవాబు జంగ్ బహద్దూర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇంజనీర్స్‌డే జరుపుకుంటున్నామని పంచాయతీరాజ్ ఎస్‌ఈ శ్రీహరిగౌడ్ తెలిపారు. పంచాయతీరాజ్‌శాఖలో గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్ ఈఈ నర్సింహులు, డీఈ పాండురంగారెడ్డి, ఏఈలు సాల్‌మాన్, మధు, ధనుంజయ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ మహంకాళి సేవలు మరువలేనివి

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల బీజేపీ అధ్యక్షుడుగా గుర్రాల మహంకాళి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మహంకాళి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. బాల్‌రెడ్డి, గోవింద్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

◆ జర్నలిస్టులపై దాడి అమానుషం

పాపన్నపేట(మెదక్): ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిస్టులపై దాడి చేసిన పోలీసులపై చర్య తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీ మాజీ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. డీఎస్సీ పరీక్షలపై జరుగుతున్న నిరసన కార్యక్రమాన్ని కవర్ చేయడానికి వెళ్లిన వారిపై దాడి చేయడం దారుణం అన్నారు.

◆ దివ్యాంగులను ఆదుకోవాలి


నిజాంపేట(మెదక్): అంత్యోదయ కార్డులను అందించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కల్వకుంట గ్రామానికి చెందిన దివ్యాంగులు వినతి పత్రం అందజేశారు. తహసీల్దార్ సురేశ్ కుమార్ మాట్లాడుతూ వినతి పత్రాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాన్నారు. మైసయ్య, రాజు, సత్యనారాయణ గౌడ్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

◆ ఎల్‌ఓసీ అందజేత

నర్సాపూర్: అత్యవసర వైద్యం కావాల్సిన పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మేలు జరుగుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. గురువారం శివ్వంపేట మండలం శభాష్‌పల్లికి చెందిన సునీతకు రు.2.50లక్షలు ఎల్‌ఓసీని అందజేశారు. సునీత భర్త శ్రీకాంత్‌కు గుండె ఆపరేషన్ కోసం ప్రభుత్వం నుంచి ఎల్‌ఓసీ ద్వారా సహాయం వచ్చిందని చెప్పారు. ఆయన వెంట కరుణాకర్‌రెడ్డి, నవీన్‌గుప్తా, గంగాధర్ తదితరులు ఉన్నారు.

నైపుణ్యాలు దేశాభివృద్ధికి దోహదం

- ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హుస్సేన్

మెదక్ కలెక్టరేట్: యువత నైపుణ్యాలను సాధించి దేశాభివృద్ధికి దోహదపడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.హుస్సేన్, అర్థశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ ఆకుల సుధాకర్ పిలుపునిచ్చారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశం జనాభాలో మొదటి స్థానంలో ఉందన్నారు. ఇది భారతదేశ భవిష్యత్‌కు, పురోగమనానికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో తిరుమలరెడ్డి, గణపతి, శరత్ రెడ్డి, దినకర్, వామనమూర్తి, శేఖర్, మురళి, పి.వెంకటేశ్వర్లు, సురేందర్ రావు, సమీరా నాస్మిన్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రాజా గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.